నిధుల్లేకుండా స్వచ్ఛత ఎట్లా..?

- **తూతూ మంత్రంగా 'స్వచ్ఛదనం పచ్చదనం'**
- **అంతంతమాత్రంగా ప్రజాప్రతినిధులు హాజరు**
- **అప్పులపాలవుతున్న పంచాయతీ కార్యదర్శులు**

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం పచ్చదనం' మొక్కుబడిగా సాగుతున్నది. కనీస స్థాయిలో నిధులు విడుదల చేయకుండా పనులు ఎలా సాధ్యమని గ్రామ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా పాల్గొనడం లేదని విశ్లేషకులు విమర్శలు చేస్తున్నారు. గతంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు కచ్చితంగా నిధులు విడుదల చేసిన తరువాతే కార్యక్రమానికి శ్రీకారం చుట్టేవారని గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవేవీ పట్టించుకోకుండా ప్రతిపక్షాల విమర్శలకు తలొగ్గి మొక్కుబడిగా కార్యక్రమాన్ని ప్రకటించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్వచ్ఛదనం పచ్చదనం ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించాలని నిర్ణయించారు. పలు పారిశుద్ధ్య పనులు, ఇంకుడు గుంతల నిర్మాణం ప్రధాన ఎజెండాగా కార్యక్రమాన్ని రూపొందించారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనేందుకూ డబ్బులు విడుదల చేయలేదని మాజీ ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు విమర్శిస్తున్నారు.

అప్పుల పాలైన కార్యదర్శులు

ఒక్కో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇప్పటికే లక్షల్లో అప్పుల పాలై ఉన్నారని, అదనం గా డబ్బులు పెట్టే పరిస్థితి లేదని చెప్పారు. త మ కుటుంబాలు గడవటమే కష్టంగా ఉందని, ఇంకెక్కడినుంచి డబ్బులు తేవాలని పంచాయతీ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. అనేక మంది కార్యదర్శులు గతంలో పనిచేసిన పంచాయతీల నుంచి బదిలీ అయ్యామని, పాత పంచాయతీలో పెట్టిన డబ్బులు వస్తా యా? రావా? అనే ఆందోళనలో ఉన్నారు. కొత్త పం చాయతీలో డబ్బులు పెడితే వస్తాయో? రా వో?అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులన్నీ చేయకపోతే అధికారులు మెమోలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

హరితహారంతో అటవీ విస్తీర్ణం వృద్ధి

- **రాజ్యసభ సాక్షిగా వెల్లడించిన కేంద్రప్రభుత్వం**

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హయాంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన 'హరితహారం' కార్యక్రమం వల్ల రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించింది. గత పదేండ్లలో దేశవ్యాప్తంగా 1,700 చదరపు

కిలోమీటర్ల అటవీ భూమి తగ్గినప్పటికీ తెలంగాణలో 647 చ.కి.మీ. పచ్చదనం పెరిగినట్టు ప్రకటించింది. 2015 జూలైలో ప్రారంభమైన హరితహారంలో భాగంగా 9 విడతల్లో మొత్తం 273.33 కోట్ల మొక్కలను నాటారు. ఇందుకోసం ప్రభుత్వం తొమ్మిదేండ్లలో దాదాపు రూ.10,822 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 14,864 నర్సరీలు, 13,657 ఎకరాల్లో 19,472 పల్లె ప్రకృతి వనాలు, 6,298 ఎకరాల్లో 2,011 బృహత్ ప్రకృతి వనాలు, 1,00,691 కి.మీ. రహదారి వనాలు ఏర్పాటు చేసింది.

మెట్రో నగరాల్లో హైదరాబాద్ టాప్

అటవీ విస్తీర్ణాన్ని పెంచుకున్న మెట్రో నగరాల జాబితాలో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచినట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2019- 2021 మధ్య అటవీ విస్తీర్ణం ఎక్కువగా పెరిగిన రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ (647 చ.కి.మీ.), తెలంగాణ (632 చ.కి.మీ.), ఒడిశా (537 చ.కి.మీ.) వరుస స్థానాల్లో నిలిచాయి.

హరితహారానికి గుర్తింపు, అవార్డులు

- *ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ 2020, 2021లో హైదరాబాద్‌ను 'ట్రీ సిటీ ఆఫ్ ద వరల్డ్'గా గుర్తించి అర్బన్ డే ఫౌండేషన్ అవార్డు ప్రదానం చేసింది.*
- *నీతి ఆయోగ్ సమీకృత అభివృద్ధి లక్ష్యాల సూచీల్లో (2020- 21) అడవుల పెంపు విభాగంలో ప్రథమ స్థానం.*
- *2022లో ఏఐపీహెచ్‌పీ హైదరాబాద్‌కు 'వరల్డ్ గ్రీన్ సిటీ' అవార్డు ఇచ్చింది.*
- *వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) నిర్వహించిన 'సిటీ నేచర్ చాలెంజ్-2023లో హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచి, అత్యధిక జీవ వైవిధ్య నగరంగా గుర్తింపు పొందింది.*
- *పచ్చదనం పెంపులో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉన్నట్టు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ (సీఎస్ఈ) సంస్థ వెల్లడించింది.*

హరితహారం కొనసాగించాలి

భారత్‌లో గత దశాబ్ద కాలంగా 1,700 చ.కి.మీ. అటవీ భూమి తగ్గినప్పటికీ తెలంగాణలో పచ్చదనం గణనీయంగా పెరిగింది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన హరితహారం కార్యక్రమం విజయవంతమైందనడానికి ఇదే నిదర్శనం. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని ఆశిస్తున్నా.

-సంతోష్ కుమార్, మాజీ ఎంపీ

- **ప్రధాని మోదీకి మందకృష్ణ కృతజ్ఞతలు**

ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మోదీ మందకృష్ణను ఆలింగనం చేసుకున్నారు.

కోర్టులో చూసుకోండి

- **జీవో ప్రకారమే నడుచుకోండి**
- **మీరు హరీశ్‌రావును కలిశారు కదా?**
- **జీవో 33లో మార్పులు కోరిన**
- **తల్లిదండ్రులపై మంత్రి దామోదర ఆగ్రహం**

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): జీవో-33లో మార్పులు చేయాలని కోరేందుకు వెళ్లిన తమపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తంచేశారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. శుక్రవారం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను హైదరాబాద్‌లో కలిశారు. తమ పిల్లలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రతిపక్ష నేతలను కలుస్తారా? అని తమపై కసురుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఓ ఆడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. 'మీరు హరీశ్‌రావును కలిశారు కదా, విమర్శిస్తున్నారు కదా.. జీవో ప్రకారం నడుచుకోండి, ఏదైనా ఉంటే కోర్టులో చూసుకోండి' అని సీరియస్‌గా మాట్లాడారని పేర్కొన్నారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో లేరని, రాగానే ఆయనతో మాట్లాడుతానని చెప్పి పంపించారని తెలిపారు.

జీవో 33ను రద్దు చేయాలి

జీవో 33ను రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ శుక్రవారం డిమాండ్ చేశారు. స్థానికత నిర్ధారణ ప్రక్రియలో చేసిన మార్పు కారణంగా విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, స్వరాష్ట్రంలోని విద్యార్థులే స్థానికేతరులుగా మారే దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర సరిహద్దుల్లోని జిల్లాలకు చెందిన విద్యార్థులు వారికి ఉన్న వెసులుబాటు, ఇతర కారణాలవల్ల పక్క రాష్ట్రంలో ఇంటర్ పూర్తి చేసి, తిరిగి మన ప్రాంతానికి వచ్చి వైద్య విద్యను అభ్యసించాలనుకుంటారని చెప్పారు. జీవో 33తో వారంతా స్థానికతను కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థులకు న్యాయం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై 12న 'సుప్రీం' విచారణ

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈడీ, సీబీఐ కేసుల్లో తనకు బెయిల్‌ను నిరాకరిస్తూ గత నెల 1న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆమె సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈ నెల 12న జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్ ధర్మాసనం విచారణ జరుపనున్నది.

ఎక్సైజ్‌శాఖలో కమీషన్ దందా

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిరోజూ కోట్లాది రూపాయలను అందించే ప్రధాన ఆదాయ వనరుల్లో అబ్కారీ శాఖ ముఖ్యమైనది. ఈ శాఖలో డబ్బుల గలగలపై కొన్ని కమీషన్‌రాయుళ్ల కండ్లు పడ్డాయి. కొత్త ప్రభుత్వంలో అక్రమార్జనపై దృష్టిపెట్టిన కొందరు ఆ శాఖలో అడుగుపెట్టిన దగ్గర్నుంచి.. 'పెండింగ్ బిల్లులకు పేమెంట్ చెయ్యాలా? అయితే మరి మాకేంటి?' అంటూ డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్ క్లియరెన్స్‌కు పేమెంట్ ఇవ్వాల్సిన దుస్థితి దాపురించింది.

- **ముడుపులు ఇచ్చే సప్లయర్స్‌కే పేమెంట్?**
- **5 నుంచి 10 శాతం వరకు కమీషన్!**
- **ఎంత త్వరగా ఇస్తే.. అంత త్వరగా పేమెంట్?**
- **రూ.6 వేల కోట్ల వరకు సప్లయర్స్‌కు బాకీ**

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ పేమెంట్లు ఆపకుండా.. రెగ్యులర్‌గా డబ్బులు రావాలంటే ఆ సప్లయర్స్ కొత్తగా కమీషన్ ఇచ్చుకోవల్సి వస్తుంది. వాళ్ల పెండింగ్ అమౌంట్‌ను బట్టి కమీషన్ ధర ఫిక్స్ చేస్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా అబ్కారీశాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపులలో 'కమీషన్' అనే పదం వినిపిస్తుండటంతో సప్లయర్స్ కంగుతింటున్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని మద్యం వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. పెండింగ్ బిల్లులు రావాలంటే ఎంతోకొంత ఇవ్వాల్సిన దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. ఈ నయా దందా రికార్డుల ప్రకారం అంతా సక్రమంగానే జరిగినా.. బయట మాట్లాడుకునే కమీషన్‌పైనే ఆధారపడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మద్యం కృత్రిమ కొరత వ్యవహారం బయటికి పొక్కడంతో.. ఈ కమీషన్ దందాకు తెరలేపారని వ్యాపారులు చెబుతున్నారు.

ఇదీ ఆ కమీషన్ కహానీ..!

మద్యం సరఫరా చేసే సంస్థల నుంచి డబ్బులు చెల్లించి ప్రభుత్వం మద్యం తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈ డబ్బును చెల్లించేందుకు 45 రోజుల వరకు గడువు ఉంటుంది. కొత్త ప్రభుత్వానికి సంక్షేమ పథకాలు అమలుకు డబ్బులు అవసరం ఉండటంతో.. ఎక్సైజ్‌శాఖ నుంచి వచ్చే డబ్బులను ఆయా పథకాలకు మళ్లించింది. దీంతో మద్యం సప్లయర్స్‌కు చెల్లించాల్సిన బకాయిలు పెరిగిపోయాయి. ప్రభుత్వం ఎలాగైనా డబ్బులు చెల్లిస్తుందనే నమ్మకంతోనే సప్లయర్స్ మద్యం సరఫరా చేస్తున్నారు. ఇప్పుడా బకాయిలు సుమారు రూ.6వేల కోట్ల వరకు ఉన్నట్టు తెలిసింది. ఈ బకాయిల క్లియరెన్స్‌పై కొందరు ప్రభుత్వ పెద్దల కన్ను పడిందని వ్యాపారులు చెబుతున్నారు. ఏ సప్లయర్స్ అయితే తమతో సఖ్యతగా ఉండి, అడిగినంత కమీషన్ ఇస్తారో.. వారికి ప్రభుత్వం విడుదల చేసిన నిధులను చెల్లిస్తున్నట్లు మిగతా వ్యాపారులు వాపోతున్నారు. కమీషన్ ఇవ్వని వ్యాపారులకు చెల్లింపులు ఆపుతున్నారని వాపోతున్నారు.

5 నుంచి 10 శాతం కమీషన్..

ఎక్సైజ్‌శాఖకు మద్యం సరఫరా చేస్తున్న సప్లయర్స్ వారి పెండింగ్ బిల్లును బట్టి.. సుమారు 5 నుంచి 10శాతం వరకు కమీషన్ ఇవ్వాల్సి వస్తుందని అంటున్నారు. లేకపోతే.. 'ప్రభుత్వం ఇంకా డబ్బులు విడుదల చేయలేదు. రాగానే మీకు చేస్తాం' అంటూ కొందరిని పెండింగ్‌లోనే పెడుతున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులలోంచి ప్రభుత్వం ప్రతినెలా సప్లయర్స్‌కు రూ.600 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు చెల్లిస్తున్నది. ఆయా సప్లయర్ పెండింగ్ బిల్లును బట్టి కమీషన్ అంటే.. దీంట్లోనుంచే కోట్లాది రూపాయలను తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. ఈ ఏడాది మే నాటికి రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి సుమారు రూ.3వేల కోట్ల వరకు పెండింగ్ బకాయిల చెల్లింపులకు నిధులు విడుదలైనట్టు సమాచారం. మే నాటికి సుమారు రూ.1500 కోట్లను ఆయా సప్లయర్స్‌కు చెల్లించినట్టు తెలిసింది. వీటిల్లో ఎంత కమీషన్ ప్రభుత్వ పెద్దలకు చేరిందో.. ఆ పెరుమాళ్లకే ఎరుక అంటున్నారు సప్లయర్స్.

గిరిపుత్రులది కపటం లేని ఆత్మీయత

కేటీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ గిరిజ న దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. 'కల్లా కపటం లేనిత నం.. ఆత్మీయతల్లో అమ్మగుణం.. గి రులనే నివాసాలుగా మలుచుకొని.. ప్రకృతితో మమేకమైన జీవనం గడిపే అడవిబిడ్డలకు.. హృదయపూర్వకంగా అంతర్జాతీయ గిరిజన దినోత్సవ శు భాకాంక్షలు' అంటూ ట్వీట్ చేశారు. కొండకోనల్లోని ఆవాసాలకు.. మిషన్ భగీరథతో జలాలు అందించిన ఘన త కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. 'పోడు భూముల గోడును మాత్రమే తీర్చలేదు.. రైతుబంధును అందించడం తో ఆగలేదు.. రాష్ట్ర రాజధానిలో ఆత్మగౌరవ భవనాలు.. గిరిబిడ్డల అస్థిత్వానికి ప్రతీకలు.. అడవి బిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే సంకల్పం.. చరిత్రలో చెరగని సంతకం' అని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పదేండ్ల ప్రస్థా నం.. వారి అభ్యున్నతిలో సువర్ణ అధ్యాయం' అని ట్వీట్ చేశారు.

ఆదివాసీల కలను నిజం చేసిన ఘనత కేసీఆర్‌దే

- **10 శాతం రిజర్వేషన్లు అమలు చేశాం**
- **మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఆదివాసీ గిరిజనుల కలను సాకారం చేసిన ఘనత బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. గిరిజన బిడ్డల దశాబ్దాల డిమాండ్లను నెరవేర్చారని తెలిపారు. 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం' సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 'విధ్వంసపు దారుల నుంచి వికసిత తోవలు. మోడువారిన బతుకుల్లో మోదుగు పూల పరిమళాలు' అని ఆదివాసీ గిరిజనుల కోసం కేసీఆర్ సర్కార్ చేసిన ప్రయత్నాలను అభివర్ణించారు. 'మావ నాటే మావ రాజ్... మా తండాలో మా రాజ్యం' అనే ప్రజాస్వామిక ఆకాంక్షను సాకారం చేస్తూ 3146 గూడేలను, తండాలను పంచాయతీలుగా చేశారని గుర్తు చేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో గిరిజనుల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచేందుకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ దేశానికే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారని, 'జల్..జంగల్.. జమీన్' నిజం చేసిన ఘనత కేసీఆర్‌దేనని ఉదహరించారు.

గిరిజన చట్టాలకు కేంద్రం తూట్లు

- **రాష్ట్ర మంత్రి సీతక్క ఆగ్రహం**

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): గిరిజన చట్టాలకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బంజారాహిల్స్‌లోని కుమ్రంభీం ఆదివాసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టాన్ని కేంద్రం గతేడాది సవరించి నిర్వీర్యం చేసిందని పేర్కొన్నారు. గ్రామసభల అనుమతులు లేకుండానే ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో యథేచ్ఛగా మైనింగ్ చేసేలా కేంద్రం చట్ట సవరణ చేయటాన్ని ఆమె తప్పుబట్టారు. ఈ ప్రయత్నాలను అడ్డుకునేందుకు కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ తనకు 8 మంది అక్కాచెల్లెండ్లు ఉన్నారని, సీతక్క తొమ్మిదో సోదరి అని పేర్కొన్నారు. పలువురిని సన్మానించారు.

జీవో-46పై ప్రభుత్వాన్ని వదలం

- **పోరాటం చేస్తున్న అభ్యర్థులకు అండగా ఉంటాం**
- **జీవో 46 బాధిత అభ్యర్థులకు కేటీఆర్ అభయం**

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విధంగా జీవో-46 అభ్యర్థులకు న్యాయం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరుతూ జీవో-46 అభ్యర్థులు శుక్రవారం కేటీఆర్‌ను నందినగర్‌లోని నివాసంలో కలిశారు. ఎన్నికలకు ముందు జీవో-46ను రద్దు చేస్తామని నమ్మబలికితే కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు సహకరించామని, అయితే ఆ పార్టీ నాయకులు గెలిచిన తర్వాత తమను పట్టించుకోవడం లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యాత్మకంగా మారిన జీవో-46 అంశంపై తాను గతంలో సీఎస్‌తో మాట్లాడిన విషయాన్ని కేటీఆర్ వారికి గుర్తుచేశారు. ఇందుకోసం బీఆర్‌ఎస్ నుంచి కావాల్సిన సహకారాన్ని అందిస్తామని అభయమిచ్చారు. ఈ విషయంలో తమ పార్టీ నాయకులు గత కొన్ని రోజులుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కోర్టు కేసుల పేరు చెప్పి తప్పించుకుంటూ అభ్యర్థులకు అన్యాయం చేసే ప్రయత్నం మంచిదికాదని హితవు పలికారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ విషయంపై ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ధైర్యమిచ్చిన కేటీఆర్‌కు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పార్టీ నాయకులు రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జీవో-46 వల్ల తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి చేపట్టే ఉద్యోగ నియామకాలతోపాటు తొమ్మిది శాఖల ఉద్యోగాల భర్తీలో గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు నష్టం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

జీవో46పై విచారణకు 25 సార్లు డుమ్మా?

- **వరస వాయిదాలు కోరుతున్న అడ్వకేట్ జనరల్**
- **25 వాయిదాలతో విచారణ మళ్లీ వాయిదా**
- **19న తప్పనిసరిగా హాజరుకావాల్సిందేన్న కోర్టు**
- **మా సమస్యను త్వరగా పరిష్కరించండి**
- **ముఖ్యమంత్రికి కానిస్టేబుల్ అభ్యర్థుల వినతి**

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి రాగానే 46 జీవోను రద్దు చేసి, కానిస్టేబుల్ పరీక్షల్లో మెరిట్ సాధించిన వారికి న్యాయం చేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తక్షణం అడ్వకేట్ జనరల్‌ను హైకోర్టుకు పంపి, తమ న్యాయమైన సమస్యను పరిష్కరించాలని కానిస్టేబుల్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. మెరిట్ వచ్చిన తమకు లేనిపోని ఆశలు కల్పించి.. ఉద్యమించేలా చేసి, తీరా కేసు హైకోర్టుకి రావడంతో ప్రభుత్వ పెద్దలు తప్పించుకొని తిరగడం ఏమాత్రం భావ్యంగా లేదని వాపోతున్నారు. ఎమ్మెల్యేల అనర్హత కేసులో హైకోర్టుకు హాజరవుతున్న ఏజీ.. వేలాది మంది అభ్యర్థుల భవిత్యాన్ని తేల్చే జీవో 46పై జరిగే వాదనలకు ఎందుకు హాజరు కావడంలేదని ప్రశ్నిస్తున్నారు.

ఈనెల 19న తుది విచారణ..

46 జీవో రద్దుపై హైకోర్టులో ఈనెల 19న తుది వాదనలు జరగనున్నాయని, దానికైనా అడ్వకేట్ జనరల్ వచ్చి ప్రభుత్వం తరపున వాదన ఏంటో స్పష్టంగా చెప్పాలని కానిస్టేబుల్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. 'నిరుద్యోగులు కొట్లాడితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని.. కానీ, ఆ నిరుద్యోగులకు మీ ప్రభుత్వంలో న్యాయం జరగడం లేదు సార్' అంటూ కానిస్టేబుల్ ఉద్యోగార్థులు తీవ్రఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కోర్టులోనే తేల్చుకుందామని, ఇప్పుడు కోర్టుకే న్యాయవాదులను పంపకపోతే మమ్మల్ని మోసం చేసినట్టు కాదా? అని ఆవేదన చెందుతున్నారు. 46 జీవో రద్దు గురించి రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ వేసిందని, అందులోనూ బాధిత జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే ఒక్క ప్రజాప్రతినిధిలేడని కానిస్టేబుల్ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. కేవలం రెండు నెలల్లో రిపోర్టు ప్రభుత్వానికి ఇస్తామని చెప్పిన కమిటీ.. ఒక్కసారైనా తమ సమస్య కోసం కూర్చుందా? ప్రభుత్వంతో చర్చించిందా? రిపోర్టు ప్రభుత్వానికి ఇచ్చిందా? అని ప్రశ్నిస్తున్నారు.సబ్ కమిటీ త్వరగా రిపోర్టు ఇస్తే.. దానిని కోర్టులో సమర్పిస్తే.. తదుపరి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఈ విషయంలో ప్రస్తుత ప్రభుత్వం దగ్గర సరైన సమాధానం లేకపోవడంతోనే అడ్వకేట్ జనరల్ వరసగా వాయిదాలు కోరుతున్నారని అంటున్నారు. కోర్టుఫీజులు కట్టుకోలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు.

ఇంజినీరింగ్ సీట్ల పెంపుపై ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్

- **జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు**
- **27 కాలేజీల పిటిషన్లు డిస్మిస్**

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపు, కుదింపు, కొత్త కోర్సులకు అనుమతి ఇవ్వడం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. వివిధ కోర్సుల్లో సీట్ల పెంపుపై ప్రభుత్వ నిర్ణయమే అంతిమమని స్పష్టం చేసింది. కాలేజీలకు అనుబంధంగా ఆఫ్ క్యాంపస్‌ల ఏర్పాటుకు కూడా రాష్ట్ర ప్రభుత్వమే అనుమతి ఇవ్వాలని జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి శుక్రవారం తీర్పు చెప్పారు. కొత్త కోర్సుల ప్రారంభం, సీట్ల పెంపు, కుదింపు, కోర్సుల విలీనం, రద్దుకు ఉన్నత విద్యాశాఖ అనుమతి ఇవ్వకపోవడంపై 27 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్లను తిరస్కరించారు.

వీధి కుక్కలా ? క్రూర మృగాలా ?

ఇబ్రహీంపట్నంరూరల్/తెలుగు యూనివర్సిటీ/ మణికొండ/వరంగల్ చౌరస్తా/ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 9 : రాష్ట్రంలో కుక్కల దాడిలో పసిప్రాణాలు రాలిపోతున్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని రాయపోల్‌కు చెందిన శివకుమార్ మాధురి దంపతుల కుమారుడు కియాన్ష్ (4) నెల రోజుల క్రితం వీధికుక్కల దాడిలో గాయపడ్డాడు. వెంటనే నగరంలోని దవాఖానలో చికిత్స చేయించగా వైద్యులు కుట్లువేశారు. ఇన్‌ఫెక్షన్ కారణంగా బాలుడు అనారోగ్యానికి గురికాగా నిలోఫర్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నిలోఫర్ ఘటన మరువక ముందే నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట సబితానగర్‌లో మానసికస్థితి సరిగాలేని ఓ బాలుడి మర్మాంగంపై కుక్కలు దాడి చేశాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వలసకూలీలు రాజు, అంజమ్మ దంపతుల పెద్దకుమారుడు భరత్(07) మానసికవైకల్యంతో మంచానికే పరిమితమయ్యాడు. ఇంట్లో మంచంపై పడుకున్న భరత్‌పై వీధికుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా రక్తస్రావం అవుతున్న బాలుడిని నార్సింగిలోని ప్రైవేటు దవాఖానకు తరలించగా వైద్యులు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం పరిస్థితి కొంతమెరుగ్గా ఉన్నా 48 గంటలు గడిస్తేకానీ చెప్పలేమని వైద్యులు తెలిపారు. వరంగల్ ఎంజీఎంలో మానవత్వం మంటగలిసేలా మూడురోజుల శిశువు మృతదేహాన్ని పోలీసు ఔట్‌పోస్టు పక్కనే గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. శుక్రవారం సాయంత్రం శిశువు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతింటుడాన్ని గమనించిన ఔట్ పోస్టు సిబ్బంది విషయాన్ని వైద్యాధికారులు, మట్టెవాడ పోలీసులకు సమాచారం అందజేశారు. ఎంజీఎం వైద్యాధికారులు మృతదేహాన్ని పరిశీలించి శిశువు వయస్సు మూడు నుంచి నాలుగు రోజులు ఉంటుందని, శిశువు జననం హాస్పిటల్‌లో జరిగినట్టుగా గుర్తించారు. శిశువు మృతదేహాన్ని వస్త్రంలో చుట్టి మార్చురీలో భద్రపరిచారు. శిశువు శరీర భాగాలను కుక్కలు చీల్చడంతో ఆడ, మగ అనే విషయాన్ని కూడా గుర్తించలేని స్థితికి చేరుకుందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని గురువారం ఒకేరోజు ఏడుగురు చిన్నారులపై పిచ్చి కుక్క దాడి చేసింది. శుక్రవారం మరొకరిపై దాడి చేసింది. గ్రామస్థులు కర్రలతో దాడి చేయగా కుక్క మృతి చెందింది.

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- **భవనం పైనుంచి దూకడంతో తీవ్రగాయాలు**
- **ములుగు జిల్లా కేంద్రంలో ఘటన**

ములుగు, ఆగస్టు 9 (నమస్తేతెలంగాణ): గురుకులం విద్యార్థిని భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకున్నది. ములుగు మండలం జంగాలపల్లికి చెందిన కొయ్యడ కార్తీకశ్రీ గురుకులంలో 9వ తరగతి చదువుతున్నది. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో విద్యార్థిని మెట్ల మార్గంలో భవనంపైకి ఎక్కి వెనుక వైపు దూకింది. చుట్టుపక్కల ఇండ్ల యజమానులు చూసి గురుకుల సిబ్బందికి తెలిపారు. చాలాసేపటి తర్వాత సదరు ఉపాధ్యాయినులు వచ్చి గురుకులం లోపలికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. గాయాలతో కదలలేని స్థితిలో ఉన్న బాలికను చూసిన చుట్టుపక్కల వారు దవాఖానకు తీసుకెళ్లాలని గొడవ చేయడంతో ఆటోలో ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు నడుముతోపాటు పక్కటెముకలు విరిగినట్టుగా గుర్తించి, మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం దవాఖానకు తరలించారు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు అంబులెన్స్‌లో తరలించగా ఎంజీఎంలో సైతం బెడ్లు ఖాళీ లేకపోవడంతో సుమారు గంటపాటు అంబులెన్స్ స్ట్రెచర్‌పైనే విద్యార్థిని అవస్థ పడినట్టు డ్రైవర్ తెలిపారు. అనంతరం వైద్యులు పరీక్షించి చికిత్స ప్రారంభించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు. కాగా, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులపై పర్యవేక్షణ లోపించడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు పేర్కొన్నారు. ఇటీవల బండారుపల్లి టీజీఆర్ గురుకులంలోనూ ఇలాంటి ఘటనే జరిగిందని అంటున్నారు.

గురుకులాల్లో చావుకేక

మొదటిపేజీ తరువాయి...

కలిసి తల్లిగారిల్లయిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఉంటున్నది. పంట పొలాల మధ్యలో ఉన్న పాఠశాల ఆవరణలో పాముల సంచారం ఉండడంతో విద్యార్థులు వణికిపోతున్నారు. పెద్దాపూర్ గురుకులంలో ఆరో తరగతి చదువుతున్న ఎడ్మల అనిరుధ్(11) గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి భోజనం చేశాడు. అనంతరం పక్కనే ఉన్న మూత్రశాలకు వెళ్లి పాఠశాలకు తిరిగొచ్చాడు. కొద్దిసేపటి తర్వాత కడుపు నొస్తుందని అనిరుధ్ ఏడ్చుకుంటూ చెప్పినట్టు తోటి విద్యార్థులు తెలిపారు. విద్యార్థులతో కలిసి నేలపై పడుకోగా, తెల్లవారుజామున కడుపునొప్పి ఎక్కువ కావడంతో తోటి విద్యార్థులు కేర్‌టేకర్లకు తెలిపారు. కేర్‌టేకర్లు, వాచ్‌మెన్ హుటాహుటిన విద్యార్థిని కోరుట్ల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో జగిత్యాల దవాఖానకు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

మరో ఇద్దరికి అస్వస్థత

ఆరో తరగతికి చెందిన మరో ఇద్దరు విద్యార్థులు కడుపునొప్పితో అస్వస్థతకు గురయ్యారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన మొండి మోక్షిత్, మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన అల్లి హేమంత్‌యాదవ్ అనే విద్యార్థులు కడుపునొప్పితో బాధపడగా, మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ దవాఖానకు తరలించారు. ఘటనపై కోరుట్ల పోలీసులు, అధికారులు పాఠశాలకు చేరుకొని విచారణ జరిపారు. జగిత్యాల ఇన్‌చార్జి డీఈవో జనార్దన్ రావు స్కూల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. వరుసగా జరుగుతున్న ఘటనలకు పాముకాటే కారణమన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. పక్షం రోజుల క్రితమే ఓ విద్యార్థి మరణించగా, విద్యార్థులను నూతన భవనంలోకి మార్చారు. శుక్రవారం మరో విద్యార్థి చనిపోయాడని తెసుకుని నమస్తే తెలంగాణ స్కూల్‌కు వెళ్లిన సమయంలోనూ పాము కనిపించడం గమనార్హం.

ప్రభుత్వ విప్ నిలదీత

గురుకుల విద్యాలయ పరిశీలనకు వచ్చిన ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు పిల్లల తల్లిదండ్రుల నుంచి చేదు అనుభవం ఎదురైంది. నెలకొన్న సమస్యలు, వరుసగా జరుగుతున్న ఘటనపై నిలదీశారు. పిల్లలకు పడకునేందుకు బెడ్లు లేవని, మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు దూరంగా ఉన్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. అప్పటికే అదనపు కలెక్టర్ రాంబాబు అక్కడికి రావడంతో సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం

మృతదేహాన్ని పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

పెద్దాపూర్ గురుకులానికి వెళ్లిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఘటనపై ఆరా తీయగా, తమకేమీ తెలియదని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది బదులివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పదిహేను రోజుల క్రితం ఓ విద్యార్థి మృతి చెందినా ఇంత నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా ఎలా ఉన్నారని ప్రశ్నించారు. అనంతరం మెట్‌పల్లి దవాఖానలో చికిత్స పొందుతున్న హేమంత్‌యాదవ్‌ను, నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న మోక్షిత్‌ను పరామర్శించారు. జగిత్యాలలోని ప్రభుత్వ దవాఖానలో అనిరుధ్ మృతదేహాన్ని ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనిరుధ్‌తోపాటు ఇటీవల మృతిచెందిన ఆరపేటకు చెందిన రాజారాపు గణాదిత్య కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలో ఇలాంటి ఘటనలు జరగడం చాలా బాధాకరమని, విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.